క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి



మహబూబాబాద్ రూరల్: రాష్ట్రస్థాయి కబడ్డీ అండర్–14 ఎస్‌జీఎఫ్‌ఐ క్రీడలకు మహబూబాబాద్ మండలంలోని రెడ్యాల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి గుగులోత్ చరణ్ ఎంపికయ్యాడని పాఠశాల హెచ్‌ఎం బి.సక్రునాయక్ సోమవారం తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయుడు ధరావత్ మోహన్ నాయక్, ఉపాధ్యాయ బృందం అశోక్, ఇస్మాయిల్, వెంకన్న, లక్ష్మీదేవి, సంధ్యారాణి, లక్ష్మయ్య, శ్రీనివాస్ అభినందించారు.

రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఎన్నిక



మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయుల రిటైర్డ్ ఎంప్లాయీస్ వేల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సంకా బద్రినారాయణ, ప్రధాన కార్యదర్శిగా గుగులోతు కిషన్ నాయక్, కోశాధికారిగా గుడె చంద్రమౌళి, జిల్లా గౌరవ అధ్యక్షులుగా సోమ గోవర్ధన్, ఉపాధ్యక్షులుగా ఆర్వి.చలం, యోగేశ్వర్‌రావు, అంబటి రవీందర్, తులసీ పద్మావతి, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, మురళీధర్ స్వామి, రత్నం, పద్మం, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఎస్పీని కలిసిన ఏఎస్సైలు

మహబూబాబాద్ రూరల్: హెడ్ కానిస్టేబుళ్ల నుంచి ఏఎస్సైలుగా పదోన్నతిపొందిన ముగ్గురు అధికారులు ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్‌ను సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఖమ్మం కమిషనరేట్ పరిధిలో హెడ్ కానిస్టేబుళ్లగా విధులు నిర్వహిస్తున్న కృష్ణమూర్తి, లక్ష్మయ్య, గౌస్ ఏఎస్సైలుగా పదోన్నతిపొందారు. జిల్లాకు వారిని కేటాయించారు.

స్కూల్ అసిస్టెంట్ టు ఎంపీడీఓ



కురవి: మండలంలోని మోద్గులగూడెం జెడ్పీ హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్(బయోలాజికల్ సైన్స్) టీచర్‌గా పనిచేస్తున్న గుడేల్లి విష్ణు ఇటీవల వెలువడిన గ్రూపు–1 ఫలితాల్లో ఎంపీడీఓగా నియామకం అయ్యాడు. ఈమేరకు హైస్కూల్‌లో సోమవారం హెచ్‌ఎం సత్యనారాయణచారి ఆధ్వర్యంలో తోటి ఉపాధ్యాయులు విష్ణును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లత, ఇందిర, సలీం, రజిత, భాగ్యలక్ష్మి, టి.రమేష్, బలాస్టి రమేష్, వెంకన్న, లక్ష్మి, వీరయ్య పాల్గొన్నారు.

టైం స్కేల్ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని మల్యాల గ్రామంలో గల జేవీఆర్ హెచ్‌ఆర్‌ఎస్ పరిధిలో పని చేస్తున్న టైం స్కేల్ ఎంప్లాయీస్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నామని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.అజయ్ సారథిరెడ్డి సోమవారం తెలిపారు. టైం స్కేల్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నిదానపల్లి శ్రీరాములు, షేక్.ఇమాం, గౌరవ అధ్యక్షుడిగా బి.అజయ్ సారథిరెడ్డి, గౌరవ సలహాదారుగా రేశపల్లి నవీన్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బానోతు లింగ్యనాయక్, ఉపాధ్యక్షుడిగా వెలుగు శ్రావణ్, నిదానపల్లి ఎల్లయ్య, హుస్సేన్, సహాయ కార్యదర్శులుగా చింతకాయల వెంకన్న, చింతకాయల లచ్చమ్మ, కార్యవర్గ సభ్యులుగా పలువురు ఎన్నికయ్యారన్నారు.

డాక్టరేట్ ప్రదానం

తొర్రూరు రూరల్: చెన్నైలోని ఎస్‌ఆర్‌ఎం విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ అవార్డును మండలంలోని సోమారం గ్రామానికి చెందిన డీసీసీబీ డైరెక్టర్ కాకిరాల హరిప్రసాద్‌రావు కుమార్తె దుర్గా భవాని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చేతుల మీదుగా సోమవారం అందుకున్నారు.

నేడు సంఘటన్ సృజన్ అభియాన్ సమావేశం

మహబూబాబాద్ రూరల్: జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష ఎన్నికల ప్రక్రియలో భాగంగా సంఘటన్ సృజన్ అభియాన్ సమావేశం మంగళవారం ఉదయం 10.30గంటలకు నిర్వహిస్తారని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ నిర్వాహకులు సోమవారం తెలిపారు. ఈ సమావేశానికి ఏఐసీసీ పరిశీలకులు దేబాసిస్ పట్నాయక్, టీపీసీసీ పరిశీలకులు ఎమ్మెల్యే శంకరయ్య, పిసారి మహిపాల్ రెడ్డి, జువ్వాడి ఇందిరారావు, ఎండీ అవేజ్, శ్రీకాంత్ యాదవ్, జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలతోపాటుగా ఎంపీ పోరిక బలరాంనాయక్ పాల్గొంటారన్నారు.

భారీ వర్షంతో అతలాకుతలం

- ఉధృతంగా ప్రవహించిన వాగులు
- తడిసిన మక్కలు
- మునిగిన పంటపొలాలు



డోర్నకల్: పొంగి ప్రవహిస్తున్న మున్నేరువాగు



గూడూరు సమీపంలో ఉధృతంగా పాకాలవాగు



కొత్తగూడ: వాగు దాటిస్తున్న స్థానికుడు కిరణ్



కురవి: ఖమ్మం–కురవి రహదారిపై..



మరిపెడ రూరల్: వీరారం గ్రామంలో మునిగిన వరి పొలాలు



గార్ల: చిన్నబంజర గ్రామంలో నీట మునిగిన వైకుంఠధామం



గంగారం: ప్రవహిస్తున్న పందిపంప్పుల వాగు

గూడూరు: ఆదివారం రాత్రి నుంచి కురుస్తున్న వార్షాలకు మండలంలో 89 శాతం వర్షపాతం నమోదైంది. దీంతో మండలంలోని పలు గ్రామాల్లో చేతికి వచ్చిన మక్కలు ఆరబోయగా, తడిసి ముద్దయ్యాయి. గూ

కురవి: సీరోలు, కురవి మండలాల్లో ఎడతెరిపి లేకుండా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురియడంతో వాగులు, వంకలు పొంగిపొర్లి ప్రవహించాయి. సీరోలు మండలం తాళ్లసంకీస వద్ద ఖమ్మం–కురవి మధ్య 365/ఏ జాతీయ రహదారిపై లో–లెవల్ వంతెనపై నుంచి వరద ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

డోర్నకల్: ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షం పడటంతో పట్టణ సమీపంలోని మున్నేరువాగు భారీగా వరద పోటెత్తింది. వరద ప్రవాహాన్ని తిలకించేందుకు స్థానికులు భారీగా మున్నేరు బ్రిడ్జి వద్దకు తరలివచ్చారు.

మరిపెడ రూరల్: మరిపెడ మండలం ఆదివారం రాత్రి కుండపోతగా కురిసిన అకాల భారీ వర్షానికి నష్టం వాటిల్లింది. మండలంలోని పలు గ్రామాల్లో వరి పంటలు వరదనీటిలో మునిగాయి. అకాలం వర్షాం రైతులకు తీవ్ర నష్టాన్ని తెచ్చిపెట్టింది. అదేవిధంగా మండలంలోని పలు చెరువులు నిండుకుని అలుగులు పోస్తున్నాయి.

గంగారం: మండలంలోని గ్రామాల్లో ఆదివారం అర్ధరాత్రి కురిసిన వర్షాలకు వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. బ్రిడ్జిలు దాటే ప్రయత్నాలు ప్రజలు చేయొద్దని ఎస్సై రవి కుమార్ కోరారు. మండలంలోని మడగూడెం– తిరుమలగండి మధ్య ఉన్న పందిపంప్పుల వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది.

కొత్తగూడ: మండలంలోని అన్ని వాగులు వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. ప్రమాదాలు జరుగకుండా ఎస్సై రాజ్‌కుమార్ వాగుల వద్ద పోలీస్ కానిస్టేబుల్, గ్రామపంచాయతీ సిబ్బందిని పహారా విధులు వేశారు. రాంపూర్ గ్రామానికి చెందిన మహిళ తన చిన్న కూతురు వైద్యం కోసం వచ్చి వాగు వద్ద వేచి ఉండటం గమనించిన స్థానిక యవకుడు యాదగిరి కిరణ్‌కుమార్ కానిస్టేబుల్ సహకారంతో తల్లీకూతుళ్లను వాగు దాటించారు.

గార్ల: గత రాత్రి కురిసిన భారీ వర్షాలకు గార్ల సమీపంలోని పాకాల ఏరు చెక్‌డ్యాం పైనుంచి పొంగి ప్రవహిస్తుండటంతో గార్ల నుంచిరాంపురం, మద్దివంచ పంచాయతీల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

విజయవంతం చేయాలి

గూడూరు: బీసీ రిజర్వేషన్లపై జరిగిన కుట్రకు వ్యతిరేకంగా ఈనెల 18న తలపెట్టిన తెలంగాణ బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ సంఘాల జేఏసీ రాష్ట్ర నాయకుడు పెదకాసు కుమారస్వామి, కట్ల విష్ణుగౌడ్ కోరారు. మండల కేంద్రంలో సోమవారం బీసీ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) సమావేశం జరిగింది. కార్యక్రమంలో నాయకులు నూకల ఉపేందర్‌యాదవ్, గుర్రపు యాకాంబ్రం, గుండెబోయిన మల్లేష్, నూకల సురేందర్, బ్రహ్మచారి, కాయితోజు దేవేంద్రాచారి పాల్గొన్నారు.

విపత్తుల సమయాల్లో అండగా నిలవాలి

తొర్రూరు: ప్రకృతి విపత్తుల వేళ బాధితులకు స్థానిక యువత అండగా నిలవాలని మేరా యువ భారత్ జిల్లా యూత్ కోఆర్డినేటర్ బానోతు వీరన్న నాయక్ తెలిపారు. ప్రపంచ విపత్తు కుదింపు దినోత్సవం సందర్భంగా మేరా యువ భారత్, సన్‌రైజర్స్ యూత్‌ల ఆధ్వర్యంలో సోమవారం డివిజన్ కేంద్రంలోని వెంకటేశ్వర ఒకేషనల్ జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జాటోతు రమేష్, వైస్ ప్రిన్సిపాల్ బి.అశోక్, డైరెక్టర్లు భూక్య శ్రీనివాస్, మచ్చ సాగర్, విద్యార్థులు పాల్గొన్నారు.

జ్వరంతో బాలుడి మృతి



దంతాలపల్లి: జ్వరంతో ఓ బాలుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దంతాలపల్లి మండల కేంద్ర శివారులోని రాజ్యాతండాకు చెందిన జాటోత్ వెంకన్న, సునీతల కుమారుడు చంటి(11) జ్వరం రావడంతో తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. జ్వరం తగ్గకపోవడంతో హన్మకొండలోని డాల్ఫిన్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నాలుగు రోజులు వైద్యం అందించిన బాలుడి శరీరం మందులకు స్పందించలేదు. చివరగా వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి చంటి మృతిచెందాడు.

సేవా దృక్పథం అలవర్చుకోవాలి



అవగాహన కల్పిస్తున్న సుగుణాకర్‌రాజు

తొర్రూరు: విద్యార్థి దశలోనే సేవా దృక్పథం అలవర్చుకోవాలని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ పగిడిపాటి సుగుణాకర్‌రాజు అన్నారు. మహబూబాబాద్ గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో కొనసాగుతున్న క్యాంపులో భాగంగా మూడోరోజు డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో శ్రమదానం నిర్వహించారు. ఆస్పత్రి ఆవరణలో పేరుకుపోయిన వ్యర్థాలు, పిచ్చి మొక్కలు తొలగించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మునుకుంట్ల యాదలక్ష్మి, వలంటీర్లను సూపరింటెండెంట్ సుగుణాకర్ రాజు అభినందించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు క్యాంపులు దోహదపడతాయన్నారు. దేశ భవిష్యత్‌కు విద్యార్థులే మూలమన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి బి.నందనదేవి, వైద్యులు మీరాజ్, శంకర్, ప్రియాంక, మానస, అధ్యాపకులు చైతన్య, రజిని, వలంటీర్లు పాల్గొన్నారు.

స్తంభాన్ని ఢీకొట్టిన ట్రాక్టర్

డోర్నకల్: స్థానిక పాతడోర్నకల్‌లో సోమవారం సిమెంటు ఇటుకల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ రోడ్డు పక్కన విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో స్తంభం విరిగి పక్కనే ఉన్న ఇంటిపై పడింది. స్థానికుల వివరాల ప్రకారం.. ఇల్లెందు సమీంపలోని లచ్చగూడెం నుంచి బలపాలకు ఇటుకలను తీసుకెళ్తున్నారు. ట్రాక్టర్ స్థానిక గండి సత్యనారాయణ మిల్లు మలుపు వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును తప్పించబోయి పక్కనే ఉన్న సిమెంట్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో స్తంభం విరిగి నంజాల దామోదరాచారి ఇంటిపై పడింది. ఘటన జరిగిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

ఔట్ సోర్సింగ్ వర్కర్లకు వేతనాలు అందించాలి



అధికారికి వినతిపత్రం ఇస్తున్న ఔట్‌సోర్సింగ్ వర్కర్లు

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో దళిత సంక్షేమ హాస్టల్‌లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ వర్కర్లకు పెండింగ్ వేతనాలు అందించాలని వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు తప్పెట్ల వీరన్న కోరారు. జిల్లా కేంద్రంలోని ఎస్సీ సంక్షేమ అభివృద్ధి శాఖ కార్యాలయంలో జిల్లా అధికారి శ్రీనివాస్‌రావుకు పెండింగ్ వేతనాలు అందించాలని సోమవారం ఔట్ సోర్సింగ్ వర్కర్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 8నెలలుగా జీతాలు రాక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం, జిల్లా పాలన అధికారులు తమపై దయచూపి వేతనాలు అందించాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో వర్కర్స్ రేణుక, వెంకటనారాయణ, ఉష, వసంత, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మృతిపై సమగ్ర విచారణ జరపాలి



నిరసన తెలుపుతున్న సంఘాల నాయకులు

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ ఉరి వేసుకుని మృతి చెందిన సంఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని ఏఐటీయూసీ, సీఐటీయూ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. టీచర్ మృతిపై విచారణ జరిపించాలని పోస్టుమార్టం గది ఎదుట సోమవారం ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో స్నేహబిందు, ఎల్లారీశ్వరీ, సులోచన, అజయ్, ఆకుల రాజు, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, వెలుగు శ్రావణ్, అంగన్‌వాడీలు పాల్గొన్నారు. అంగన్‌వాడీ టీచర్ మృతదేహాన్ని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, మాజీ ఎంపీ మాలోత్ కవిత సందర్శించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహాన్ని పరిశీలించి నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని అధికారులు, వైద్యులకు సూచించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు జరిగేలా చూడాలని సూచించారు.

దేశ సేవ చేయడం గర్వకారణం



సుధాకర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

మహబూబాబాద్ రూరల్: దేశ రక్షణ కోసం ఆర్మీ జవాన్ సుధాకర్ సేవలందించడం గర్వకారణమని కంబాలపల్లి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం గిరిజ అన్నారు. మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి గ్రామానికి చెందిన పాఠశాల పూర్వ విద్యార్థి, ఆర్మీ జవాన్ కొలిశెట్టి సుధాకర్ 24సంవత్సరాలు భారతదేశ సైనిక దళం, దేశ రక్షణలో సేవలు అందించి పదవి విరమణ పొంది స్వస్థలానికి వచ్చారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుధాకర్‌ను సన్మానించారు. అదే విధంగా కంబాలపల్లి కథలు చిత్ర డైరెక్టర్ కంబాలపల్లి గ్రామ నివాసి గుర్రాల ఉదయ్‌ని సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం రామసహాయం శ్రీధర్ రెడ్డి, కాసం శ్రీనివాసరావు, తిరుపతి, శిబారాణి, మల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, వీరభద్రం, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బయ్యారం: మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతూ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో సోమవారం బయ్యారంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులు మద్దతు ధర కన్న తక్కువకు మొక్కజొన్న కొనుగోలు చేస్తున్నారన్నారు. అనంతరం తహసీల్దార్ నాగరాజుకు సమస్యలతో కూడిన వినతిపత్రంను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మురళీకృష్ణ, భిక్షం, నర్సింహా, నాగేశ్వరరావు, లింగన్న, రాంబాబు, వెంకటేశ్వర్లు, వీరభద్రం, రాము, శోభన్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మరిపెడ రూరల్: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రతీ ఒక్కరు అప్రపత్తంగా ఉండి రోగాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యుడు గుగులోతు రవి అన్నారు. సోమవారం మండంలోని అబ్బాయిపాలెం ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మాధవి, తరణి, విజయ, ఆశ వర్కర్ జ్యోతి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

డోర్నకల్: విద్యార్థులు చదువులతోపాటు క్రీడా, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సీహెచ్ కృష్ణబాను కోరారు. స్థానిక మోడల్ స్కూల్‌లో పదిరోజుల పాటు నిర్వహించిన ఇటర్న్‌షిప్ కార్యక్రమాలు సోమవారం ముగిశాయి. కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్ ఫణికమల్, ఫుట్‌బాల్ కోచ్ గోవర్ధన్ పాల్గొన్నారు.

పొగాకు నియంత్రణకు కృషి చేయాలి

దంతాలపల్లి: ప్రతీ ఒక్కరు పొగాకు నియంత్రణకు కృషి చేయాలని మండల వైద్యురాలు కవిత అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని ఎంజేపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పొగాకు నియంత్రణపై అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈసందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

బకాయిలను విడుదల చేయాలని ధర్నా

తొర్రూరు రూరల్: బెస్ట్ అవైలబుల్ ఫీజు బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బాధిత విద్యార్థులు, తల్లిదండ్రులు మండలంలోని వెలికట్ట గ్రామ శివారులోని అభ్యాస్ స్కూల్ ఎదుట ధర్నా కార్యక్రమాన్ని చేపట్టి, ఆర్డీఓకు పలు డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల డివిజన్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మహంకాళి సాయిమల్లు, హెచ్ మహేందర్, నాయకులు శివార్ల నాగేష్‌బాబు, ఈదురు ఐలయ్య పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్‌కు 'బెస్ట్ ఫర్మార్మెన్స్ అవార్డు'

తొర్రూరు: ఉమ్మడి జిల్లాలోని 77క్లబ్‌లలో ఉత్తమ పనితీరు కనబర్చిన తొర్రూరు లయన్స్‌క్లబ్ ప్రథమ స్థానంలో నిలిచి 'బెస్ట్ ఫర్మార్మెన్స్ అవార్డు' దక్కించుకుంది. తాజాగా హన్మకొండలో జరిగిన పురస్కార ప్రధానోత్సవంలో తొర్రూరు క్లబ్ అధ్యక్షుడు రాంనర్సయ్య పురస్కారాన్ని అందుకున్నారు.

కుర్చీల పంపిణీ

కేసముద్రం: మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో లయన్స్‌క్లబ్ సీనియర్ పాస్ట్ జోన్ చైర్మన్, మాజీ సర్పంచ్ రావుల రవిచందర్‌రెడ్డి, రావుల విజితారెడ్డి మనుమరాలు మహికారెడ్డి పుట్టినరోజు సందర్భంగా, విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, అంగన్‌వాడీ సెంటర్‌కు కుర్చీలను సోమవారం అందజేశారు.

అనారోగ్యంతో పల్లేపర్చస్ వర్కర్ మృతి

మరిపెడ రూరల్: మరిపెడ మండలం ఆనెపురం గ్రామ పంచాయతీ పల్లేపర్చస్ వర్కర్ షేక్ జానీవియా (45) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. అతని మృతికి సీఐటీయూ జిలా కార్యదర్శి కుంట ఉపేందర్, యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎండీ మొయినుద్దీన్, బండ్ల అప్పిరెడ్డి నివాళులర్పించారు.

కుల వివక్షతోనే అధికారి మృతి

నెహ్రూసెంటర్: హర్యానా రాష్ట్రంలో ఏపీకి చెందిన దళిత ఐపీఎస్ అధికారి పోరన్‌కుమార్ కుల వివక్ష కారణంగానే ఆత్మహత్యకు పాల్పడ్డాడని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రాంమూర్తి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

కేసు నమోదు చేయాలి

మహబూబాబాద్: సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి చేసిన వారిపై వెంటనే కేసు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శాగంటి రమేష్, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎండీ పాషా సోమవారం అదనపు కలెక్టర్ అనిల్ కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఇంట్లోకి ప్రవేశించిన కొండచిలువ

కురవి: మండలంలోని తట్టుపల్లి గ్రామంలో దొంతు రవి అనే వ్యక్తి ఇంట్లోకి ఆదివారం రాత్రి కొండచిలువ ప్రవేశించడంతో కుటుంబసభ్యులు భయాందోళనలకు గురయ్యారు. ఆదివారం రాత్రి భారీ వర్షం పడుతున్న సమయంలో కొండచిలువ ఇంట్లోకి ప్రవేశించడంతో వెంటనే అప్రమత్తమైన రవి కొండచిలువను చంపేశాడు.

ఘనంగా పోషణ మాసోత్సవం

కురవి: నేరడ సెక్టార్ పరిధిలో సీరోలు మండలం చింతపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా పోషణ మాసోత్సవ కార్యక్రమం జరిగింది. డోర్నకల్ సీడీపీఓ లక్ష్మీ పాల్గొన్నారు. ప్రకృతిలో దొరికే తక్కువ ఖర్చుతో కూడిన ఆహార పదార్థాలలో పోషకాలు అధికంగా ఉంటాయని తెలిపారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి తీవ్రగాయాలు

మరిపెడ రూరల్: మండలంలోని బాల్నిధర్మారం గ్రామానికి చెందిన బొజ్జ విజయ్ ఓ పని నిమిత్తం సోమవారం రాత్రి తన బైక్ పై మరిపెడ మండల కేంద్రానికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో గాలివారిగూడెం స్టేజివద్ద బైక్ అదుపుతప్పి కింద పడడంతో విజయ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల 108లో జిల్లా ఆసుపత్రికి తరలించారు.

అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు

గూడూరు: క్యాటరింగ్ టెండర్ బిల్లు చెక్కును తనకు తెలియకుండానే మరొకరి పేరుతో విత్‌డ్రా చేశారంటూ అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పోకు ఫిర్యాదు చేసినట్లు కాంట్రాక్టర్ మహ్మద్ సల్మాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఐకేపీ వీఓఏల వేతనం పెంచాలి

నెల్లికుదురు: ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం ఐకేపీ వీఓఏలకు రూ.26వేల వేతనం పెంచి ఇవ్వాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెలశాల సుధాకర్, సీఐటీయూ నాయకుడు పెరుమాండ్ల బాబూగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో హనుమంతు, ఇంద్ర, మంజుల, అశోక్, రమేష్, సుజాత పాల్గొన్నారు.

విద్యుత్ పునరుద్ధరణ

చిన్నగూడూరు: చిమ్మచీకటిని సైతం లెక్కచేయకుండా విద్యుత్ అధికారులు, సిబ్బంది విద్యుత్ సమస్యను గుర్తించి మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. ఆదివారం సాయంత్రం నుంచి ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం సంభవించింది. ఎల్లంపేట–చిన్నగూడూరు ఫీడర్ 33కేవీ లైను మధ్యలో వివిధ ప్రదేశాలలో పిడుగుపాటుకు 15ఇన్సులేటర్లు ధ్వంసమయ్యాయి. చిన్నగూడూరు ఇన్‌చార్జ్ ఏఈ జహూర్ పాషా పర్యవేక్షణలో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మరమ్మతులు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

22.5క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

డోర్నకల్: డోర్నకల్ మీదుగా అక్రమంగా తరలిస్తున్న 22.5 క్వింటాళ్ల నల్లబెల్లాన్ని డోర్నకల్ పోలీసులు పట్టుకున్నారు. డోర్నకల్ ఎస్సై ఎస్‌కె ఖాదర్‌పాషా తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద వాహన తనిఖీ నిర్వహిస్తుండగా కురవి వైపు వెళ్తున్న ట్రాలీ వాహనాన్ని నిలిపి తనిఖీ చేయగా 45బస్తాల్లో 22.5క్వింటాళ్ల నల్లబెల్లం, 5బస్తాల పటిక, 15 లీటర్ల నాటుసారా పట్టుబడినట్లు తెలిపారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ జరుపగా హైదరాబాద్‌లోని హయాత్‌నగర్‌కు చెందిన సతీష్ గద్వాల్‌లోని పల్లె ప్రతాప్‌కు చెందిన ట్రాలీ వాహనంలో నల్లబెల్లం, పటికను కురవికి చెందిన బానోత్ రెడ్యాకు తరలిస్తుండగా పట్టుకుని బానోత్ రెడ్యాతోపాటు ట్రాలీ ఓనర్ పల్లె ప్రతాప్, డ్రైవర్ రేపల్లెకు చెందిన వద్దె రాజును అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు.